క్లుప్తంగా

సీఐగా అంకమరావు బాధ్యతల స్వీకరణ


సీఐ అంకమరావు

వెంకటాచలం : వెంకటాచలం సీఐగా బి.అంకమరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సీఐగా ఉన్న గంగాధర్‌రావును ఓ కేసులో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో మంగళగిరిలో పనిచేస్తున్న బి.అంకమరావును వెంకటాచలం సీఐగా నియమించడంతో సోమవారం ఉదయం వెంకటాచలం వచ్చి బాధ్యతలు చేపట్టారు.

బీమా సాయం అందజేత



బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన యాకసిరి శ్రీనుకు స్థానిక కౌన్సిలర్ శ్రీదేవి వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో యాకసిరి రమణయ్య మృతి చెందాడని, అతనికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను రమణయ్య కుమారుడు శ్రీనుకు అందజేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు పెంచలయ్య, హనుమారెడ్డి, సచివాలయ సిబ్బంది శ్రీలత, రేణుక పాల్గొన్నారు.

డాక్టర్ మురళీకృష్ణకు సత్కారం



ముత్తుకూరు : మండలంలోని పాటూరువారి కండ్రిగ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ మురళీకృష్ణ, ఆయన సతీమణి సాయిలక్ష్మిలను సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో జరిగిన వీడ్కోలు సమావేశంలో ఎంపీడీఓ ప్రత్యూష, ఎంపీపీ గండవరం సుగుణ, ఎంఈఓలు మధుసూదన, హేమసుందరరావు, ఈదూరు రామ్మోహనరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ రాజారామరెడ్డి, లక్ష్మణరెడ్డి తదితరులు ప్రసంగించారు. విద్యాబోధన, క్రమశిక్షణ, అంకితభావం కలిగిన డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ ఉపాధ్యాయులకే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

జాబ్ మేళా రేపు

నెల్లూరు(మినీబైపాస్): కొత్తూరు సమీపంలోని ఎస్సార్‌ఆర్ ఐటీఐ ఆవరణలో కాంటినెంటల్ కాఫీ శ్రీసిటీ ఆధ్వర్యంలో జాబ్ మేళాను బుధవారం నిర్వహించనున్నామని కరస్పాండెంట్ రెహ్మాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐ ఎలక్ట్రిషియన్, ఫిట్టర్ మెషినిస్ట్స్, టర్నర్, వెల్డర్, తదితర ట్రేడ్లలో ఉత్తీర్ణులైన వారు అర్హులని చెప్పారు. 50 ఖాళీలున్నాయని, వివరాలకు 97039 67967 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వేదగిరిలో విశేష పూజలు

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ సంప్రోక్షణ పూజలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విశేష హోమాలు, కుంభారాధన, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకాలను ఆగమ విద్వాన్ సత్యనారాయణాచార్యులు, ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు పర్యవేక్షణలో వేదపండితులు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ధ్వజస్తంభ దాత కాకాణి నరహరిరెడ్డి, ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో..

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరిని ఈఓ అర్చభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, రాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రత్నం జయరామ్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. తమ దాతృత్వంతో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. అనంతరం ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈఓ మల్లికార్జునరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు ఆహ్వానించారు. దేవస్థాన అభివృద్ధికి సహకరించాలని కోరగా, వారు సానుకూలంగా స్పందించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, నేతలు రాములమ్మ, బాబ్జీ, సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, శరత్ చంద్ర, వాసంతి, అవినాష్, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి సమ్మిళితంగా పాలన


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల సమ్మిళితంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మనుబోలు మండల కేంద్రంలో రూ.40 లక్షలతో నిర్మించిన షాదీ మంజిల్, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలకు మంత్రి కాకాణి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మైనారిటీ నేతలు కాకాణిని శాలువాలతో సత్కరించారు. అనంతరం వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద మనుబోలు మండలానికి కొత్తగా మంజూరైన 358 పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా ఆదుకుంటూ వారిని పేదరికం నుంచి బయటకు తేవడమే సంక్షేమమని తెలిపారు. అలాగే ప్రజల అవసరాలను గుర్తించి వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ వారికి అందుబాటులో ఉండడమే అభివృద్ధి అని పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 29,648 మందికి నెలకు రూ.3 కోట్ల వంతున పింఛన్ అందజేస్తే, ప్రస్తుతం 40,691 మందికి నెలకు రూ.13 కోట్లు పింఛన్ రూపంలో అందజేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్రం దేశంలో మరొకటి లేదని తెలిపారు. గతంలో పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీల సిఫార్సు లేనిదే కలెక్టర్ సైతం ఏమీ చేయలేని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం తమ ప్రభుత్వంలో వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా నేరుగా ఇంటికే పింఛన్ నగదును అందజేస్తున్నామన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే టీడీపీ నేతలు కోర్టులకు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, పీఆర్ డీఈ చంద్రశేఖర్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రవికుమార్, కార్తీక్‌రెడ్డి, ఎంపీపీ వజ్రమ్మ, సర్పంచ్ పద్మమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు అనితమ్మ, ఎంపీటీసీ రాజేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు హరగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, అజయ్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సాయిమోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కిశోర్ నాయుడు, రవీంధర్‌రెడ్డి, నవకోటి, మహేంద్రవర్మ, రఫీ, రమేష్ పాల్గొన్నారు.

ఎంపీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎంపీ, ఎమ్మెల్యేల సమక్షంలో పార్టీలో చేరిన ఎంపీటీసీ శేషమ్మ


కొడవలూరు : మండలంలోని పెమ్మారెడ్డిపాళెం ఎంపీటీసీ సభ్యురాలు ఒరుటూరు శేషమ్మ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిల సమక్షంలో కొడవలూరులో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆమెకు ఎంపీ వేమిరెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ తాను వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తుపై ఎంపీటీసీ సభ్యురాలిగా గెలుపొందినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావులంటే తనకెంతో అభిమానమని తెలిపారు. ఎంపీటీసీగా గెలుపొందినప్పటి నుంచీ వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతున్నానన్నారు. గ్రామానికి చెందిన ఓ నాయకుడు పార్టీ సమావేశం పేరుతో ఆదివారం సాయంత్రం తనను తీసుకుపోయి టీడీపీ కండువా కప్పించారని, తనకు టీడీపీలో చేరాలని లేదన్నారు. దీంతో మరుసటి రోజు సోమవారమే తిరిగి సొంత పార్టీ అయిన వైఎస్సార్‌సీపీలో చేరినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సర్పంచ్ మారంరెడ్డి రంగారెడ్డి, నాయకులు పొబ్బా రవి, ఒ.సునీతమ్మ, ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చీడపీడలతో అప్రమత్తంగా ఉండాలి


వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ముత్తుకూరు : వరి పంటను ఆశించే చీడపీడల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివన్నారాయణ, ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు మధుసూదన్, పరమశివం తెలిపారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణితో కలిసి మండలంలోని దమ్మాయపాళెంలో వరి పొలాలను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సూచించారు. వరి పంటను సుడి దోమ ఆశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ సిబ్బంది కరీమ్, నవీన్ పాల్గొన్నారు.

బాదంపప్పుపై సర్వేపల్లి రాధాకృష్ణన్



ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీ, సుబ్బారెడ్డి పాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం సోమవారం బాదంపప్పుపై పండితుడు, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రాన్ని రూపొందించారు. ఈనెల 5వ తేదీన గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయ రంగానికే వన్నె తెచ్చిన డాక్టర్ సర్వేపల్లి చిత్రాన్ని ఆవిష్కరించి, అంజలి ఘటించారు.

99.90 శాతం పింఛన్ల పంపిణీ


వృద్ధురాలు రమణమ్మకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ వంశీ

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారంతో దాదాపు 90.90 శాతం వరకు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారికి మంగళవారంతో పూర్తి చేస్తామని తెలియజేశారు. మండలంలోని 13 పంచాయతీలతో పాటు బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని వలంటీర్లు 1వ తేదీ నుంచి పింఛన్లను పంపిణీ చేస్తున్నారని, అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు కూడా పింఛన్లు అందజేశారని పేర్కొన్నారు.

అడిగిన వెంటనే రోడ్డు నిర్మాణం

- ఎమ్మెల్యే ప్రసన్నకు కృతజ్ఞతలు తెలిపిన చిన్నారి


కౌన్సిలర్ మల్లారెడ్డితో కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న చిన్నారి రోహిత

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని పదో వార్డు సుబ్బారెడ్డినగర్‌లో నాలుగో తరగతి చదువుతున్న చిన్నారి రోహిత తమ వీధికి రోడ్డు వేయాలని కోరగా, ఎమ్మెల్యే ప్రసన్న వెంటనే స్పందించి 36 రోజుల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. ఈ ఏడాది జూలై 29వ తేదీన సుబ్బారెడ్డినగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పర్యటిస్తున్న సమయంలో స్థానికంగా ఉన్న ఉప్పలూరు రోహిత తాను స్కూల్‌కు వెళ్లాలంటే కొంత దూరం నడిచి వెళ్లి బస్సు ఎక్కుతున్నానని, ఇంటి వద్దకు బస్సు వచ్చేలా సిమెంట్ రోడ్డు వేయాలని కోరింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రసన్న రూ.5 లక్షల ఎంపీ నిధులతో సిమెంట్ రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం సిమెంట్ రోడ్డు పూర్తవడంతో చిన్నారి రోహిత స్థానిక కౌన్సిలర్ మల్లారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రసన్నకు కృతజ్ఞతలు తెలిపింది.

ఏమనుకోకండి ఆంటీ..!

- వృద్ధురాలిని కత్తితో బెదిరించి.. ఆపై చైన్ అపహరణ
- పరారవుతూ నిందితుడి వింత సంబోధన


బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): వృద్ధురాలిని కత్తితో బెదిరించి.. ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి తెంపుకెళ్లాడు. ఆపై ఏమనుకోకండి ఆంటీ అంటూ పరారైన ఘటన బాలాజీనగర్‌లో సోమవారం పట్టపగలు చోటుచేసుకుంది. వివరాలు.. బాలాజీనగర్‌లోని 19వ అడ్డరోడ్డులో విశ్రాంత ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మమ్మ తన కుమారుడు రాధాకృష్ణ, కోడలు మంజువాణితో కలిసి నివసిస్తున్నారు. రామచంద్ర మిషన్ తరఫున ఇంట్లోనే ధ్యాన శిక్షణ కేంద్రాన్ని శ్రీలక్ష్మమ్మ నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల వారు వచ్చి ఆమె వద్ద శిక్షణ పొందుతున్నారు. కుమార్తెలను చూసేందుకు గానూ హైదరాబాద్‌కు రాధాకృష్ణ ఈ నెల ఒకటిన వెళ్లారు. తెలిసిన వారి ఇంట్లో సత్యనారాయణస్వామి వ్రతానికి మంజువాణి సోమవారం మధ్యాహ్నం వెళ్లారు. ఈ క్రమంలో శ్రీలక్ష్మమ్మ ఒంటరిగా ఇంట్లో ఉన్నారు. మధ్యాహ్నం 1.40 గంటల ప్రాంతంలో ధ్యాన శిక్షణకు సంబంధించిన అంశాలను ఇంటి వరండాలో ఆమె రాసుకోసాగారు. ఈ తరుణంలో మొహానికి మాస్క్ ధరించిన గుర్తుతెలియని దుండగుడు ఆంటీ అని పిలుస్తూ ఇంట్లోకి ప్రవేశించాడు. అరిస్తే చంపుతానని ఆమెను కత్తితో బెదిరించి.. గొంతు నులిమి కిందపడేశాడు. ఆమె మెడలోని 46 గ్రాముల బంగారు దండను కట్టర్‌తో తెంపి ఏమనుకోకండి ఆంటీ అంటూ పరారయ్యాడు. ఊహించని పరిణామంతో కంగుతిన్న వృద్ధురాలు కొద్దిసేపటికి తేరుకొని బయటకొచ్చి అరిచేలోపే దుండగుడు ఉడాయించాడు. దీంతో విషయాన్ని కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా ఆమె తెలియజేశారు. 112కు కాల్ చేశారు. ఘటన స్థలాన్ని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ పరిశీలించారు. వృద్ధురాలిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఘటన స్థలంతో పాటు సమీపంలోని సీసీ ఫుటేజీలను సేకరిస్తున్నారు. సాంకేతికత, ఆధారంగా నిందితుడ్ని గుర్తించే పనిలో పోలీస్ అధికారులు నిమగ్నమయ్యారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

- సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రమేష్


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీడీ రమేష్

మనుబోలు : వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థినులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్ అన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల, బాలుర వసతిగృహాలను సోమవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం అందజేస్తున్నారా.. అని విద్యార్థినులను ఆరా తీశారు. ఆయన వచ్చిన సమయంలో మేట్రిన్ మహేశ్వరి హాస్టల్‌లో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వసతిగృహాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ 74 మంది విద్యార్థినులు ఉండగా సుమారు 30 మందికి అదనంగా ఎలా బిల్లులు పెడుతారని మేట్రిన్‌ను ప్రశ్నించారు. 74 మందికి మాత్రమే బిల్లు చెల్లించేలా ఆదేశాలు ఇస్తామన్నారు. మేట్రిన్ స్థానికంగా నివాసముంటూ హాస్టల్‌లో విద్యార్థినులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. దీనికి మేట్రిన్ మహేశ్వరి వివరణ ఇస్తూ ఆన్‌లైన్‌లో విద్యార్థినుల వేలిముద్రల ఆధారంగానే మెస్ బిల్లులు పెడుతున్నామని తెలిపారు. స్థానికంగానే నివాసముంటున్నానన్నారు. అనంతరం పిడూరు తూము వద్ద ఉన్న బాలుర వసతిగృహాన్ని డీడీ పరిశీలించారు. అక్కడ కేవలం ఎనిమిది మంది విద్యార్థులు మాత్రమే ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంత తక్కువ మంది విద్యార్థులు ఎందుకు ఉన్నారని వార్డెన్ సుధాకర్‌ను ప్రశ్నించారు. కరోనాకు ముందు 60 మందికి పైగా విద్యార్థులు ఉండేవారని, కరోనా మొదలు హాజరు తగ్గిపోయిందని సుధాకర్ వివరణ ఇచ్చారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని వార్డెన్‌కు సూచించారు.

పోషకాహారంతో ఆరోగ్యకర ప్రసవం


కొడవలూరు : గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

- ఏసీడీపీఓ అరుణ

కొడవలూరు : పోషకాలున్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకర ప్రసవానికి మార్గం సుగమం అవుతుందని ఏసీడీడీపీఓ టి.అరుణ సూచించారు. పోష్టికాహార మాసోత్సవంలో భాగంగా మండలంలోని టపాతోపులో గర్భిణులు, బాలింతలకు పోషక విలువలున్న ఆహారంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహార లోపం వల్ల రక్తహీనత లాంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ఫలితంగా ఆరోగ్యకర బిడ్డకు జన్మనివ్వడం కుదరదన్నారు. మార్కెట్‌లో తక్కువ ధరకు లభ్యమయ్యే పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకర బిడ్డకు జన్మనివ్వవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు టి.నాగభూషణమ్మ, ఎన్.నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మైపాడులో సీమంతాలు


ఇందుకూరుపేట : సీమంతాలు జరిపిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఇందుకూరుపేట : పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని మైపాడులో గర్భిణులకు సోమవారం సీమంతాలు నిర్వహించారు. అనంతరం ఫుడ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ మంచి పోషకాలున్న ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇక్కడ ఇచ్చే పోష్టికాహారాన్ని క్రమ పద్ధతిలో తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటరమణమ్మ, కృష్ణవేణి, మంజుల, రేణుక, సీత తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో ప్రాణాలకు ముప్పు

- ఎస్‌ఈబీ సీఐ బాలకృష్ణ


మాట్లాడుతున్న సెబ్ సీఐ బాలకృష్ణ

ఇందుకూరుపేట : మాదకద్రవ్యాలతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఎస్‌ఈబీ సీఐ బాలకృష్ణ తెలిపారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ఇందుకూరుపేటలోని ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వీటి పట్ల యువతలో చైతన్యం తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత స్థాయిలో రాణించాల్సిన యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.జనార్దన్, మహిళా పోలీసు ఎస్.రేష్మితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లతో పేదలకు సామాజిక భద్రత

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


తోటపల్లిగూడూరు : పింఛన్ అందజేస్తున్న కాకాణి


ముత్తుకూరులో నూతన పెన్షన్లను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


పొదలకూరు : మారెళ్ల మధుకు వికలాంగ పింఛన్ అందజేస్తున్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : పింఛన్ల పంపిణీతో పేదలకు సామాజిక భద్రత కలుగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను మంత్రి కాకాణి సోమవారం సాయంత్రం పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ సొమ్మును రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచుకొంటూ పోతున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తోటపల్లిగూడూరు మండలానికి సంబంధించి 7,685 పింఛన్లను అందిస్తుండగా మరో 433 కొత్త పింఛన్లను మంజూరు చేసినట్లు వివరించారు. సామాజిక పింఛన్లతో పాటు అనేక సంక్షేమ పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మేలు చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, పార్టీ నేతలు టంగుటూరు పద్మనాభరెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, తలమంచి సురేంద్రబాబు, మన్నెం చిరంజీవులగౌడ్, ఎంబేటి సంధ్యారాణి, రాయపు శీనయ్య పాల్గొన్నారు.

బాబు, పవన్ పగటి వేషగాళ్లు

ముత్తుకూరు : ఒంటరిగా పోటీ చేసే దమ్ములేని చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్, పవన్‌కళ్యాణ్‌లు రకరకాల మాటలు, పాటలు, ప్రసంగాలతో పగటి వేషగాళ్ల వలే తిరుగుతున్నారని, వీరితో జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరు మండలంలో కొత్తగా మంజూరైన 352 సామాజిక పెన్షన్లను మంత్రి కాకాణి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకళాశాల ఆడిటోరియంలో జరిగిన సభలో ప్రసంగించారు. ప్రజాభిమానం, ప్రజాబలం కలిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కోలేక ప్రజల్లో పరపతి లేని వ్యక్తులు పొత్తుల కోసం పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. ముత్తుకూరు మండలంలో 7,690 కుటుంబాలకు నెలకు రూ.2.20 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంపీడీఓ ప్రత్యూష, పార్టీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణయ్య, పార్టీ నేతలు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మునుకూరు జనార్దనరెడ్డి, నెల్లూరు శివప్రసాద్, ఆలపాక శ్రీనివాసులు, శీపారెడ్డి రామమోహన్‌రెడ్డి, కె.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

ఇంటికెళ్లి.. పింఛన్ అందజేత

పొదలకూరు : పట్టణంలోని రాపూరు రోడ్డు, టీచర్స్ కాలనీలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో అర్హులైన ఇద్దరికి పింఛన్ అందడం లేదని గుర్తించారు. అధికారులతో మాట్లాడి వారికి పింఛన్ మంజూరయ్యేలా కాకాణి కృషి చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో కొత్త పింఛన్లను మంత్రి కాకాణి సోమవారం పంపిణీ చేశారు. కాగా నడవలేని స్థితిలో ఎంపీడీఓ కార్యాలయానికి హాజరు కాలేని మారేళ్ల మధు(వికలత్వం), వైలవరపు లలితమ్మ(వృద్ధురాలు) వద్దకు వెళ్లి ఒకరికి రూ.3 వేలు, మరొకరికి రూ.2,750 పింఛన్ నగదును అందజేశారు. మంత్రి నేరుగా వచ్చి పింఛన్ అందజేయడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి వెంట సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎమ్పీటీసీ జి.శ్రీనివాసులు, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ ఉన్నారు.